క్లుప్తంగా

అదుపుతప్పి కారు బోల్తా



దాచేపల్లి: అదుపు తప్పి కారు బోల్తాపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నగర పంచాయతీ పరిధిలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ లారీ ఫంక్చర్ పడి ఆగి ఉంది. ఇది గమనించకుండా గుంటూరు వైపు నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు బోల్తా పడింది. కారులో ఉన్న నలుగురు గాయపడటంతో చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా పిడుగురాళ్లలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ జి.సంధ్యారాణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి



దుర్గి: మండల పరిధిలోని కంచరగుంట ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా నవోదయ నోడల్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి కె.సంజీవరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందజేస్తున్న పోషకాహార పదార్థాలను, నాణ్యతను పరిశీలించారు. సక్రమంగా పిల్లలకు అన్నీ పోషక పదార్థాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్ నాగమణికి ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా, సెక్రెటరీ వెంకటరెడ్డి ఉన్నారు.

దుర్గి తహసీల్దార్‌గా ఫణీంద్ర బాధ్యతల స్వీకరణ



దుర్గి: తహసీల్దార్‌గా ఇమ్మనేని ఫణీంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఇదే కార్యాలయంలో పనిచేస్తున్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన తహసీల్దార్ బదిలీల్లో కె.వేణుగోపాల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన విధుల్లో చేరలేదు. దీంతో ఫణీంద్రకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నిర్మల, రత్నకుమార్, మండల సర్వేయర్ రఘుపతి, వీఆర్‌ఓలు టి.జీరయ్య, సునీత, టి.కోటేశ్వరరావు, రత్నకుమార్, కరిముల్లా, పుల్లయ్య, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్ శాస్త్రి, రత్న ప్రకాష్, సోమ్లానాయక్, తులసినాయక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు



కారెంపూడి: వృద్ధాప్య పింఛన్ల టీడీపీ నాయకులు శుక్రవారం కూడా పంపిణీ చేశారు. ఆగస్టు ఒకటో తేదీన 99 శాతం పంపిణీ చేయగా మిగిలిన వారికి నాయకులు అందజేశారు. స్థానిక బ్రహ్మనాయుడు మేడ బజారులో పింఛన్లను టీడీపీ నాయకుడు కర్ణా అమర సైదారావు, షేక్ మోదీన్‌సా అందించారు.

సంక్షేమ గృహాలను సద్వినియోగం చేసుకోవాలి



రెంటచింతల: సంక్షేమ వసతి గృహాలలో ఉంటూ చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ప్రభుత్వ అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా భూగర్భ జల అధికారి, మండల ప్రత్యేక అధికారి టి.సత్య నారాయణ శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో ఆయన ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావుతో కలసి తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో బాలికలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని, మెనూ ప్రకారం ఆహారం ఏర్పాటు చేయాలన్నారు. బాలికలు చదువుకునేందుకు తల్లిదండ్రులు అవకాశం కల్పించాలని అప్పుడే వారు అన్ని రంగాలలో రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వై. శివనాగేశ్వర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.నరేంద్రారెడ్డి, ఎస్సీ సంక్షేమ వసతి గృహం వేల్ఫేయర్ ఆఫీసర్ అరుణకుమారి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

విజయపురిసౌత్: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ విజయపురిసౌత్ అధ్యక్షుడు పలుకూరి జోసఫ్ బాబు, చర్మకారుల సంఘం అధ్యక్షులు బీర్నీడి కుమార్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాలకు పైగా అలుపెరగని పోరాటం చేసినట్లు చెప్పారు. పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యపడిందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సభ్యులు కొండయ్య, ఇశ్రాయేలు, మరియదాసు పాల్గొన్నారు.



రెంటచింతలలో మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాదిగ



మండాదిలో మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నరేంద్ర మోదీ చిత్రపటానికి కీరాభిషేకం

రెంటచింతల: మూడు దశాబ్దాల పాటు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న మాదిగ ఉపకులాలకు అనుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇవ్వడం హర్షణీయమని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాదిగ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రధాన రహదారి వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న మాదిగలకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని మంచికల్లులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు మాదిగల జీవితాలలో వెలుగులు నింపుతుందని పాముల ప్రవీణ్ మాదిగ అన్నారు. అనంతరం గ్రామంలో పెద్దలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాలలో మండల ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు జె.ఎర్ర వెంకయ్య మాదిగ, పట్టణ అధ్యక్షుడు మరియబాబు మాదిగ, సీనియర్ నాయకులు ఎ.అంబయ్య మాదిగ. కర్ర మునలయ్య మాదిగ, యూత్ కమిటీ సభ్యులు, కుల పెద్దలు పాముల దానియేలు, పాముల లక్ష్మయ్య, పి.మధుబాబు, పి.ఆనందరావు పాల్గొన్నారు.

మండాదిలో..

వెల్దుర్తి: ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం తీర్పును నివ్వడం సంతోషకరమని మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గారా మల్లయ్య అన్నారు. మండలంలోని మండాదిలో ఎస్సీ కాలనీలో మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. మల్లయ్య మాట్లాడుత ఎస్సీ వర్గీకరణకు సాధించిన ఫలితం మంద కృష్ణ మాదిగకు దక్కుతుందన్నారు. 30 ఏళ్ల పోరాటమే ఈ విజయానికి దోహదపడిందన్నారు. వర్గీకరణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమర వీరులకు అంకితమన్నారు. కార్యక్రమంలో మాదిగ నేతలు వెల్దుర్తి మండల అధ్యక్షులు యాకోబు, సురేష్, పులిమెల అన్నారావు, దాసరి పెద యాకోబు, ప్రసాద్, వరదానం, మహేష్‌రాజు, నాగభూషణం, రోశయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ ర్యాలీ

పిడుగురాళ్ల: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు నివ్వటం హర్షించదగిన విషయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీస్ మాజీ నాయకులు మందా మోహన్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి వర్లా అగస్టీన్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు మాతంగి సత్యానందం, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒంగోలు అశోక్‌కుమార్, గురజాల నియోజకవర్గ ఇన్‌చార్జి మీసాల బాబు, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు చాట్ల సుశీల, వడ్లమూడి కోటేశ్వరరావు, పిడుగురాళ్ల మండల అధ్యక్షులు బైరపోగు అగస్టీన్, పిడుగురాళ్ల టౌన్ అధ్యక్షులు ఇస్రాయేలు, దొప్పలపూడి వెంకటేశ్వర్లు, దేగల అబ్రహాం, సాగర్, కొమ్ము మరియదాసు, జీవ, మీసాల లాజర్ , కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.

అందరు స్వాగతించాలి..

పిడుగురాళ్ల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ బిల్లును అందు స్వాగతించాల్సిన విషయమని పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పీడీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, రిజర్వేషన వర్గీకరణపై పోరాడుతున్న శక్తులకు సుప్రీం కోర్టు తీర్పు ఓదార్పుగా పేర్కొన్నారు. అనేక సందర్భాల్లో ఇటీవల వస్తున్న తీర్పులు ఆందోళన కలిగిస్తున్న ఈ తీర్పు మాత్రం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఆందోళన చేస్తున్న శక్తులకు, మద్దతు ఇస్తున్న అశేష జనవాహినికి ఆనందాన్ని కలిగిస్తుందని ఆయన తెలిపారు.

వైఎస్సార్ ప్రభుత్వంలో వివక్ష లేకుండా పింఛన్ల పంపిణీ

మాచర్ల: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరి విషయంలో ప్రభుత్వం వివక్ష చూపకుండా పింఛన్ పంపిణీ చేసింది. టీడీపీ కూటమి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పింఛన్ల పంపిణీపై వివక్ష చూపటం దారుణమని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగంతో పంపిణీ చేయాల్సిన సామాజిక పింఛన్లను టీడీపీ, జనసేన నాయకులతో పంపిణీ చేయించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో గత ఐదు సంవత్సరాలు వివక్ష చూపకుండా సామాజిక పింఛన్‌లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయటం జరిగిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తొలిసారిగా జూలై నెలలో సామాజిక పింఛన్‌ల పంపిణీ, ఆగస్టులో పింఛన్ పంపిణీ టీడీపీ కనుసన్నులలో పలువురిని ఇబ్బందులకు చేశారన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

పిడుగురాళ్ల: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నాగ రాజకుమారి అన్నారు. పట్టణంలోని న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తప్పు చేస్తు షాపు లైసెన్స్ రద్దు చేయటం జరుగుతుందని చెప్పారు.

మహనీయుడు పింగళి వెంకయ్య

మాచర్ల: పింగళి వెంకయ్య జయంతి లయన్స్ క్లబ్, పల్నాడు ఆధ్వర్యంలో స్థానిక చక్రధర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి కుర్రి సాయి మార్కొండారెడ్డి, డైరెక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి, వ్యవస్థాపకులు చుండూరు వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశానికి గౌరవం తెచ్చిన వ్యక్తి పింగళి వెంకయ్య అన్నారు. దేశానికి విలువనిచ్చే జాతీయ జెండాను రూపొందించి అందరి మన్ననలు పొందారన్నారు. ఈ జయంతి వేడుకలలో లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు కార్యదర్శి అంకారావుతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్

రెంటచింతల: స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని స్థానిక ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు. శుక్రవారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో ఆయన గ్రామ పెద్దలతో కలిసి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంత్ సేవాసంఘం నాయకులు నారాయణపురం శ్రీనివాస్, దండే శివయ్య, గాదె ఊర్ధ్వమర్రెడ్డి, సూరపురెడ్డి పుల్లారెడ్డి, కర్నాటి కోటయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా కరుణకుమార్ బాధ్యతలు స్వీకరణ



రెంటచింతల: మండల తహసీల్దార్‌గా జి.కరుణకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ మండల ప్రజలకు సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటానన్నారు. వీర్వోలు, కార్యాలయం సిబ్బంది అందరూ సమయపాలన పాటించి వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర ప్రాంతంలో మున్సిపల్ చెత్త కుండీలో చెత్త నిండి ఉన్నప్పటికీ ఖాళీ చేయకుండా రోజుల తరబడి ఉండటంతో చెత్త కంపు కొడతుండటంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. చెత్త డబ్బా చెత్త నిండి ఉన్నప్పటికి మున్సిపల్ అధికారులు ఖాళీ చేయకపోవటంతో చెత్త దుర్వాసనతో ఇబ్బంది కరంగా మారింది. ఈ చెత్త డబ్బా కూడా లెనిన్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల, పట్టణ వైద్యశాల కూత వేటు దూరంలో ఉండటం విశేషం.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రముఖ పర్యావరణ పరిరక్షకుడు కొమెర అంకారావు(జాజి) శుక్రవారం ప్రకృతి పాఠం బోధించారు. పర్యావరణం ఇబ్బందుల్లో ఉందని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని అందుకు భావి భారత పౌరులైన విద్యార్థులు అందుకు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. మన పూర్వీకులు ప్రకృతినే ఆరాధించేవారని చెట్లనే పూజించి దేవతారాధన చేసే సంప్రదాయం మన సొంతమన్నారు.

వృక్షో రక్షతి రక్షితః అనేది దేవ వాక్యమని అందరూ కూడా దానిని అనుసరించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రకృతి ప్రేమికులుగా మారితే వారి మనసులు కూడా స్వచ్ఛగా మారుతాయని మంచిగా విద్యాభ్యాసం చేయవచ్చన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయడంతో పాటు విత్తన బంతులు కూడా వర్షా కాలంలో మైదాన ప్రాంతాలలో చల్లితే అవి మొక్కలుగా ఎదుగుతాయని వివరిస్తూ విత్తన బంతుల తయారీ గురించి వివరించారు. ప్రకృతి మాత వర్ధిల్లాలని విద్యార్థులు ఈ సందర్భంగా నినాదాలు చేశారు.



విద్యార్థులతో నినాదాలు చేయిస్తున్న జాజి

పన్నులు సకాలంలో వసూలు చేయండి

మాచర్ల: పట్టణంలోని ప్రతి వార్డులో ఆస్తి, నీటి పన్నుల వసూలుతో పాటు వివిధ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించి సచివాలయ అడ్మిన్ ప్రతి సమస్య పరిష్కారానికి భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ కోరారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో 16 సచివాలయ అడ్మిన్, పురపాలక సంఘ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ఉద్యోగులకు సూచించారు. ప్రతి మున్సిపాలిటీలో ఎంతో కొంత ఆదాయం పెరుగుతుంటే మాచర్లలో మాత్రం తగ్గుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధగా పనిచేయాలన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

మాచర్ల: పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా ముందున్న అన్న క్యాంటీన్‌లో శుక్రవారం అన్నదానం చేశారు. గత 40 రోజులుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ సూరెయలమంద, ఆర్యవైశ్య సంఘ నాయకులు దరివేముల రామకృష్ణ, శుక్రవారం అన్నదాత కట్టమూరి శివ ఆధ్వర్యంలో 400 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేష్టం



ర్యాలీలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్, పక్కన ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి



కామేపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కారెంపూడి: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ గంగవరపు జోసెఫ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఒప్పిచర్లలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డితో కలసి తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు రిజిష్టర్లు పరిశీలించి చిన్నారుల తల్లిదండ్రులతో గర్భిణులతో సెంటర్ పనితీరు విషయమై అడిగి తెలుసుకున్నారు. ప్రతి సెంటర్‌కు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి షోషకాహారం దుర్వినియోగం కావడానికి వీల్లేదని అది లబ్ధిదారులకు చెందాలని స్పష్టం చేశారు. తనిఖీ అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ల నిర్వాహకులు, తల్లిదండ్రులతో కలసి తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు, ఆరోగ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి తల్లి కూడా బిడ్డకు తల్లి పాలివ్వడం ప్రకృతి ధర్మమని మిగతా ఎ విధమైన పోషకాహారం కూడా దానికి సాటి రాదని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో కారెంపూడి ఐసీడీఎస్ అధికారి ఉమ పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఆ సెంటర్ పరిధిలోని తల్లిదండ్రులు అంగన్‌వాడీ సెంటర్ కట్టించాలని కోరారు. స్థలం ఉందని గ్రాంటు విడుదల కాగానే సెంటర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

పిడుగురాళ్ల: పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలని కామేపలి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయి అన్నారు. మండలంలోని కామేపల్లిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించటం వలన రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణకుమార్, అంగన్‌వాడీ టీచర్ వల్లెం గీత, వెంకటరాములు, మాధవి, ఆశ వర్కర్లు పద్మ, మరియమ్మ పాల్గొన్నారు.



పశర్లపాడులో అవగాహన ర్యాలీ

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్య రక్ష

రెంటచింతల: తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్య రక్ష అని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి అన్నారు. ఆగస్టు ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని పశర్లపాడులో చేపట్టిన ర్యాలీని మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లి నుంచి వచ్చే పసుపు రంగు పాలు పట్టించడం ఎంతో శ్రేష్టమైనవన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీసీ సూపర్ వైజర్ నాగమణి, హెచ్‌వి పి.లక్ష్మీ ప్రసన్న, ఏఎన్ఎం శిరీష, ఎంఎల్‌హెచ్‌పీ రత్నాప్రభ పాల్గొన్నారు.

మాగాణి సాగుకు రైతుల సమాయత్తం



దమ్ము చేస్తున్న ట్రాక్టర్



యాతకు సిద్ధం అవుతున్న నారు మడి

కారెంపూడి: ఇంతకాలం ఆలనా పాలనా లేకుండా బీళ్లుగా ఉన్న మగాణి భూములకు రైతులు జలాభిషేకం చేస్తున్నారు. ఎక్కడబట్టినా ఈ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు పిచ్చి చెట్లు, కంపతో నిండి ఉన్న పొలాలను రైతులు శుభ్రం చేస్తున్నారు. శుభ్రం చేసిన పొలాలను గొర్రు, నాగళ్లు, బొచ్చెలు ఏది వీలుంటే దానితో దున్నించారు. దున్నించిన భూములను ముడి దమ్ము చేయించి మాగపెడుతున్నారు. అలాగే మరో వైపు అదే చేలో నారు మడులు సిద్ధం చేస్తున్నారు. ఈ పండుగ మొత్తానికి కారణం సాగర్ నిండుకుండలా మారుతుండడమే. కాల్వలకు నీరు వస్తాయని రైతులు ఇలా మాగాణి సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం తాగునీటి కోసం వదలిన జలాలు కాల్వలలో ప్రవహిస్తున్నాయి. ఇదే నీటి పారుదల కంటిన్యూ అయ్యే అవకాశాలు కూడా కన్పిండడంతో రైతులు పొలాలను మగాణి సాగుకు సిద్ధం చేస్తున్నారు.

కారెంపూడి మండలంలో ఎక్కువగా సాగర్ ఆయకట్టు భూములున్నాయి. అందులో మాగాణిదే అగ్రస్థానం. సుమారు 16 వేల ఎకరాల మగాణి సాగు భూములున్నాయి. దీంతో ఎక్కడెక్కడో పిచ్చి కంపతో ఉన్న చేలు కూడా వరి నాట్లకు ముస్తాబు అవుతున్నాయి. కాల్వలు వస్తేనే పండే భూములు చాలా ఉన్నాయి. పైగా వరి తప్ప అందులో ఏమీ పండని భూములు లోతట్టు ప్రాంతాలలో సుమారు రెండు వేల ఎకరాల దాకా ఉన్నాయి. ఆ భూములు సాగులోకి రావడమే ఇప్పుడు పెద్ద విశేషం. మరో వైపు బోర్లున్న రైతులు నాట్లు వేయడానికి పంట దమ్ము చేయిస్తున్నారు. చేలల్లో పెరిగిన పచ్చి రోట్ట పైర్లను తొక్కించి నాట్లు వేయడానికి సిద్ధం చేస్తున్నారు. మరో పది రోజుల్లో బోర్ల కింద నాట్లు ప్రారంభమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి.

నాగార్జునకొండ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

విజయపురిసౌత్: ఆంధ్రప్రదేశ్‌లోని వారసత్వ కేంద్రాలు, చారిత్రక స్థలాలైన నాగార్జున కొండ అమరావతిలను అభివృద్ధి చేయటానికి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. శుక్రవారం ఢిల్లీ తిలక్ మార్గ్‌లోని దరోహర్ భవన్‌లో కేంద్రపురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదు బీర్‌సింగ్ రావత్‌ను కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ ఏపీలోని చారిత్రక స్థలాలను పరిరక్షించాలని అమరావతి మహాస్థూపానికి ప్రపంచ వ్యాప్తంగా ఎనలేని ఖ్యాతి ఉందని, నాగార్జునకొండ ఆసియా ఖండంలోని రెండో అతి పెద్ద ఐలాండ్ మ్యూజియంగా ప్రాముఖ్యత చెందిందన్నారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులను కేంద్ర ప్రభుత్వం కలిస్తే పర్యాటకులను మరింత ఆకట్టుకోవచ్చన్నారు. ఈ పురాతన కట్టడాలకు ప్రత్యేక నిధులను విడుదల చేసి అభివృద్ధి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం యదుబీర్‌సింగ్ రావత్‌ను ఆయన శాలువాతో సన్మానించారు.



ఢిల్లీలో కేంద్రపురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌ను సన్మానిస్తున్న జాస్తి

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

గురజాల: 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీ నిర్వహించనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల అయినట్లు మండల విద్యాశాఖాధికారులు కె.కాంతారావు, ఎం.సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో నోటీస్ బోర్డులో నోటిఫికేషన్‌కు సంబంధించిన సమాచారం పొందుపరచడం జరిగిందన్నారు. ఈ నెల 5వ తేదీన దీనిపై అభ్యంతరాలు ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. 8వ తేదీన ఎన్నికయ్యే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించడం జరుగుతుందన్నారు. నియమ నింబధనలు ప్రకారం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గురజాల: స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి కుమారుడు పోలు మోక్షజ్ఞేశ్వర రెడ్డి జన్మదినాన్ని ఆశ్రమంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com